

సాక్షి
గుంటూరు
బుధవారం ၊ 21 ၊ ఆగస్టు ၊ 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 589.40 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,144 క్యూసెక్కులు వదిలారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 7837 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 340 క్యూసెక్కులు వదిలారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు చివరి రోజైన మంగళవారం కల్యాణ మహోత్సవం నిర్వహించారు. మహాపూర్ణాహుతి హోమంలో ఎమ్మెల్యే జీవీ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

దాతల సహకారంతో ప్లాంటేషన్



ప్రత్తిపాడు: దాతల సహకారంతో ప్రత్యేక మొక్కల ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కె.శ్రీదేవి చెప్పారు. ఈనెల 24న పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వెల్లడించారు. దీనిలో భాగంగా అనువైన స్థలాన్ని మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి, జెడ్పీ సీఈఓ ఎస్ఎస్‌వీబీ వసంతరాయుడు ప్రత్తిపాడు మండలంలో పర్యటించారు. స్థానిక నిమ్మగడ్డవారిపాలెం రోడ్డులో ఇరువైపులా రెండు వేల మొక్కలను ఒకే రోజు నాటేందుకు కావాల్సిన చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రామకోటయ్యతో పాటు ఉపాధిహామీ అధికారులకు సూచించారు. ఈ ప్రాంతం మొక్కలు నాటేందుకు అనువుగా ఉందని, కార్యక్రమానికి కలెక్టర్ హాజరవుతారని వివరించారు. మొక్కలను దాతల సహకారంతో సమకూర్చుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. వారివెంట ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ షేక్ ఖాజా, ఎన్ఆర్ఈజీఎస్ ఇన్‌చార్జి ఏపీవో మస్తాన్‌వలి, గ్రామనాయకుడు నిమ్మగడ్డ సతీష్ తదితరులు ఉన్నారు.

ఇందిరానగర్ యూహెచ్‌సీకి స్టేట్ క్వాలిటీ అవార్డు



మంగళగిరి: రాష్ట్రంలో తొలి నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్ (ఎన్క్యాస్) సర్టిఫికెట్ పొందిన ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్(యూహెచ్‌సీ) ఎస్‌హెచ్‌ఎం స్టేట్ క్వాలిటీ అస్యూరెన్స్ విజన్ అవార్డు సాధించింది. మంగళవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో యూహెచ్‌సీ డాక్టర్ పి.అనూష అవార్డు అందుకున్నారు.

ఆప్కాస్ ఉద్యోగులకు జీతాలు

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఈనెల జీతాలు అందక నగరపాలక సంస్థ ఆప్కాస్ ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులపై ఈనెల 19న సాక్షిలో జీతాలు 'బాబో' శీర్షికన ప్రచురితమైన కథనానికి నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. సీఎఫ్ఎంఎస్ అధికారులతో మాట్లాడి 20వ తేదీ మధ్యాహ్నానికి ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జీతాలు జమయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీంతో 3,175 మంది ఆప్కాస్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ బదిలీ

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లో గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశాసజినిని పులివెందులకు బదిలీ చేస్తూ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆశాసజనిపై కొంత మంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు మంగళవారం ఆశాసజినిని పులివెందులకు బదిలీ చేసినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు.

58,167 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 58,167 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 55,420 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ. 17,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,700 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,500 నుంచి రూ. 18,900 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 22,845 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.



ధ్వంస రచనపై ధర్మాగ్రహం

- గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి చూసి ఓర్వలేకే శిలాఫలకాల ధ్వంసం
- నగరపాలక సంస్థ కౌన్సిల్లో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల ధ్వజం
- కౌన్సిల్ హాల్లో కింద బైఠాయించి నిరసన



కౌన్సిల్ హాల్‌లో కింద బైఠాయించి నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు



సమావేశానికి అధ్యక్షత వహించిన మేయర్ కావటి మనోహరనాయుడు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ సీపీ హయాంలో నగరంలో చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేకే తెలుగుదేశం శ్రేణులు శిలఫలాకాలను ధ్వంసం చేస్తున్నారని వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు మండిపడ్డారు. టీడీపీ నేతల ప్రోద్బలంతో అధికారులు కావాలనే వైఎస్సార్ సీపీ ఏర్పాటు చేసిన శిలఫలాకాలను తొలగించేందుకు సిద్ధమయ్యారని ధ్వజమెత్తారు. నగరంలో అనుమతులు లేని అన్ని శిలఫలాకాలను తొలగించిన తరువాత వైఎస్సార్ సీపీ శిలఫలాకాలను ధ్వంసం చేయాలని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం మేయర్ కావటి మనోహర్ నాయుడు అధ్యక్షతన మంగళవారం రెండో రోజు కూడా జరిగింది. కౌన్సిల్ హాల్లో జరిగిన ఈ సమావేశానికి గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సల, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, అధికారులు హాజరయ్యారు. శిలాఫలకాల ధ్వంసంపై వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు కింద బైఠాయించి నిరసన తెలిపారు. మొత్తం 238 ప్రశ్నలను సభ్యులు అడిగారు. నగరపాలక సంస్థ ప్రియాంబుల్స్‌లలో ఒకట్రెండు మినహా అన్ని ప్రతిపాదనలకూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

ఎమ్మెల్యే ఇంటి ముందు కేజీఎఫ్ సెట్టింగ్‌లు

గత ప్రభుత్వ హయాంలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శిలాఫలకాలను ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ధ్వంసం చేయడంపై కార్పొరేటర్ మల్లవరపు రమ్య నిలదీశారు. అనుమతులు లేవనే సాకుతో 54వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన శిలఫలాకాల ధ్వంసానికి పూనుకున్న పట్టణ ప్రణాళిక అధికారులు.. ఎమ్మెల్యే ఇంటి ముందు ట్రాఫిక్‌కు అంతరాయంగా ఏర్పాటు చేసిన కేజీఎఫ్ సెట్టింగ్‌లను ముందు తొలగించాలని డిమాండ్ చేశారు. దీనిపై అధికారులు స్పష్టమైన ప్రకటన చేయాలని నల్లకండువా ధరించి కౌన్సిల్‌లో కింద బైఠాయించారు. ఆమెకు సంఘీభావంగా వైఎస్సార్ సీపీ సభ్యులంతా ఆందోళన చేశారు.

నగరపాలక సంస్థ స్థలాల అన్యాక్రాంతం!

గుంటూరులో పలు ప్రాంతాల్లో కార్పొరేషన్ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయని, వీటిని కాపాడడంలో అధికారులు విఫలమవుతున్నారని డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు(డైమండ్‌బాబు) విమర్శించారు. కార్పొరేటర్ శ్రీరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన రోడ్డుపైనా నిర్మాణాలకు గతంలో అధికారులు ప్లాన్ ఇచ్చారని, దీనిపై రచ్చ జరగడంతో ఉపసంహరించుకున్నారని గుర్తుచేశారు. కార్పొరేషన్ స్థలాల వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని డెప్యూటీ మేయర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా టీడీపీ, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరిగింది.

హోర్డింగ్స్ నిర్వహణలో అధికారుల మాయాజాలం

నగరంలో హోర్డింగ్స్ నిర్వహణలో అధికారులు ఉదాసీన వైఖరి ప్రదర్శిస్తున్నారని డెప్యూటీ మేయర్ వజ్రబాబు మండిపడ్డారు. ఈ విషయంలో నిబంధనలు పాటించడం లేదని విమర్శించారు. నగరంలో సుమారు 25 ప్రాంతాల్లో జెయింట్ హోర్డింగ్స్ ఏర్పాటు చేశారని, వీటి వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మే 13న ముంబైలో హోర్డింగ్ కూలి 14 మంది మరణించారని, 70 మంది గాయపడ్డారని గుర్తుచేశారు. నిబంధనల ప్రకారం లేని హోర్డింగులు తొలగించాలని, లేకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించి తొలగింపజేసే ప్రయత్నం చేస్తామని డెప్యూటీ మేయర్ హెచ్చరించారు.



వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, టీడీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం

వేంకటేశ్వర బాల కుటీర్ లీజు పొడిగింపునకు బ్రేక్..

టేబుల్ అజెండాగా శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్ విద్యాలయం లీజు రెన్యూవల్ ప్రతిపాదనను అధికారులు కౌన్సిల్ ముందుకు తీసుకురావడంతో వైఎస్సార్ సీపీ సభ్యులు తీవ్రంగా వ్యతిరేకించారు. సభ్యుల ఆమోదం లేకుండా టేబుల్ అజెండాగా పెట్టడంపై మండిపడ్డారు. ఆ విద్యాసంస్థ ఉచిత విద్య, సేవ ముసుగులో ఫీజులు వసూలు చేస్తోందని ఆరోపించారు. దీనికి స్పందించిన తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అందరి ఆమోదంతో మరోసారి ఈ అంశాన్ని ప్రవేశపెట్టాలని చెప్పారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ విద్యాలయం రెన్యూవల్‌కి ఎమ్మెల్యే మాధవి, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, కేంద్ర మంత్రి, స్థానిక కార్పొరేటర్ లేఖలు రాశారని, అందుకే టేబుల్ అజెండాగా పెట్టామని వివరించారు. త్వరలో మళ్లీ ప్రత్యేక సమావేశం పెట్టి ఈ అంశాన్ని చర్చిద్దామని వెల్లడించారు.

ఇండస్ట్రియల్ పాలసీకి సూచనలు అవసరం

పరిశ్రమల యజమానుల సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమల స్థాపనతోపాటు, ఉత్పత్తి రంగానికి ఊతమిచ్చే ఉద్దేశంతో ప్రత్యేక ఇండస్ట్రియల్ పాలసీకి శ్రీకారం చుట్టిందని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లాలోని పరిశ్రమల యజమానులు, అనుబంధ రంగాల ప్రముఖులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కొత్త పాలసీకి అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా కొందరు పారిశ్రామికవేత్తలు కొన్ని సూచనలు చేశారు. పరిశ్రమలకు పవర్, ట్రూ చార్జెస్ తగ్గించాలని, వేస్ట్ ప్లాస్టిక్‌పై ఉన్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని విన్నవించారు. గతంలో యూనిట్ కాస్ట్ రూ.75 లక్షలు ఉంటే ప్రస్తుతం రూ.25 లక్షలకు తగ్గించారని, మళ్లీ పెంచాలని కోరారు. గతంలో జిల్లాలో టెక్స్‌టైల్ పార్క్ కోసం 100 ఎకరాలు కేటాయించారని, కానీ అమలు కాలేదని, భూమిని వెనక్కు తీసుకుని ఇండస్ట్రీస్‌కు ల్యాండ్ బ్యాంక్‌గా మార్చాలని విన్నవించారు. పరిశ్రమల కోసం స్థలాలు తీసుకుని స్థాపించని వాటిని కూడా వెనక్కు తీసుకోవాలని సూచించారు. గుంటూరులోనే 128 కోల్డ్ స్టోరేజీలు ఉన్నాయని, 50 శాతానికి పైగా ఖాళీగా ఉంటున్నాయని, ఎక్కడైతే కోల్డ్ స్టోరేజీల అవసరం ఉంటుందో అక్కడ వాటికి అనుమతులు ఇచ్చి, ప్రోత్సహించాలని చెప్పారు. స్కిల్డ్ వర్కర్ల కొరత ఉందని, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు పరిశ్రమల శాఖను అనుసంధానించి శిక్షణనిస్తే బాగుంటుందని సూచించారు. సమావేశంలో చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎం.వి.శివకుమార్ రెడ్డి, ఇండస్ట్రీస్ జీఎం ఆర్.వెంకటరావు, డెప్యూటీ డైరెక్టర్ ఎం.సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.

కూటమి గొంతులో మిరపకాయ్



- మిర్చి యార్డ్ చైర్మన్ పదవి కోసం పోటీ
- సీఎం, డెప్యూటీ సీఎం సామాజికవర్గాల సిగపట్లు
- ఉగ్గిరాల సీతారామయ్యకు హామీ ఇచ్చిన పెమ్మసాని
- కుదరదంటున్న ఎంపీ సామాజికవర్గ నేతలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కూటమి గొంతులో ఎండు మిరపకాయ్ మంట పుట్టిస్తోంది. రూ.వందల కోట్ల టర్నోవర్ గల గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ పదవికి పోటీ నెలకొంది. గతంలో ఎప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నా అధినేత సామాజికవర్గానికి చెందిన వారికే పదవులు దక్కేవి. 2014 నుంచి ఐదేళ్లు ఆ సామాజిక వర్గానికి చెందిన మన్నవ సుబ్బారావే చైర్మన్‌గా కొనసాగారు. తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు బీసీ సామాజిక వర్గాలకు చెందిన చంద్రగిరి ఏసురత్నం, నిమ్మకాయల రాజనారాయణలను పదవి వరించింది.

తమకంటే తమకంటూ!

ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో మళ్లీ ఈ పదవి తమకే ఇవ్వాలని సీఎం సామాజిక వర్గానికి చెందిన నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అయితే తమకే దక్కాలని డెప్యూటీ సీఎం సామాజిక వర్గం నుంచి డిమాండ్ వస్తోంది. మొన్నటి ఎన్నికల్లో ఎంపీగా పెమ్మసాని చంద్రశేఖర్ పోటీ చేసే సమయంలో గుంటూరుకు చెందిన డెప్యూటీ సీఎం సామాజికవర్గ నేత ఉగ్గిరాల సీతారామయ్య అండగా నిలబడ్డారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత మిర్చియార్డు చైర్మన్ పదవి కావాలని ఆయన అడగగా ఎంపీ అంగీకారం తెలిపినట్లు సమాచారం. గుంటూరు ఈస్ట్, వెస్ట్, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు చెందిన సీఎం సామాజికవర్గ నేతలూ 14 మంది వరకూ ఈ పదవి కోసం పోటీ పడుతున్నారు. తమకే ఇవ్వాలని ఎంపీ పెమ్మసానిపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం. ఎన్నికల సమయంలో తాము పూర్తిగా మద్దతు ఇవ్వబట్టే ఇంత విజయం వచ్చిందని, ఇప్పుడు తమను పక్కన పెట్టడమేంటని డెప్యూటీ సీఎం సామాజికవర్గం నాయకులు మండిపడుతున్నారు. తనకు మిర్చి యార్డు పదవి తప్ప మరింకే పదవీ అవసరం లేదని సీతారామయ్య స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో ఈ పదవి విషయంలో ఎటూ తేల్చుకోలేని స్థితిలో ఎంపీ ఉన్నట్టు తెలిసింది. పోలీస్ శాఖలో సీఐల నియామకంలోనూ తమకు అన్యాయం జరిగిందని డెప్యూటీ సీఎం సామాజిక వర్గీయులు గుర్రుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో మిర్చియార్డు పదవికి కూడా సీఎం సామాజికవర్గం వారు అడ్డుపడుతుండడంతో వారు నిరసన వ్యక్తం చేస్తున్నారు. తమను ఇంకా ద్వితీయశ్రేణి నేతలుగానే చూస్తున్నారనే అభిప్రాయం వారి నుంచి వ్యక్తమవుతోంది.

రూ.40 లక్షల బంగారంతో ఇద్దరు ఉడాయింపు

- పోలీసులను ఆశ్రయించిన పసిడి వ్యాపారులు
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
- కేసు నమోదు చేయకుండా విచారణ !

మంగళగిరి: నగరంలోని పలువురు పసిడి వ్యాపారులను మోసగించి రూ.40 లక్షల బంగారంతో ఇద్దరు ఉడాయించిన ఘటన వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. పాతమంగళగిరికి చెందిన బంగారు వ్యాపారి వెంకట శివసాయి వద్ద ఈనెల 11న 170 గ్రాముల బంగారాన్ని గోలి నరేంద్ర అనే వ్యక్తి తీసుకున్నాడు. విక్రయించిన తర్వాత నగదు ఇస్తానని నమ్మబలికాడు. ఆ తర్వాత కనిపించకపోవడంతో అనుమానం వచ్చిన వ్యాపారి ఆరా తీయండంతో అతను జయరామ్ అనే వ్యక్తితో కలిసి మరికొందరు వ్యాపారులను మోసగించి బంగారంతో పరారైనట్టు తెలిసింది. నరేంద్ర, జయరామ్ పాతమంగళగిరికి చెందిన హరినాథ్ అనే బంగారం వ్యాపారి వద్ద ఈనెల 1న ఆభరణాలు తీసుకున్నారు. బిట్రా నరేంద్ర అనే వ్యాపారి వద్ద కూడా ఈనెల 7న 400 గ్రాముల బంగారం తీసుకుని పదోతేదీన వస్తామని చెప్పారు. రాకపోవడంతో గోలి నరేంద్ర తండ్రిని వ్యాపారి బిట్రా నరేంద్ర ఆరా తీశారు. గోలి నరేంద్ర తండ్రి 103 గ్రాములు తిరిగి ఇచ్చి తమ కుమారుడు రెండురోజుల్లో వస్తాడని చెప్పారు. ఆ తర్వాత కుమారుడి సమాచారం తెలియదని ఆయన చెప్పడంతో మోసపోయినట్టు తెలుసుకున్న వ్యాపారులంతా పోలీసులను ఆశ్రయించారు. ఇదిలా ఉంటే బాధితులు, నిందితుడు గోలి నరేంద్ర బంధువులు కావడం గమనార్హం. దీనిపై పోలీసులను వివరణ కోరగా నిందితుడితోపాటు మరొకరిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టామని, బాధితులు, నిందితుడు బంధువులు కావడంతో వారు మాట్లాడుకుంటున్నారని, కేసు నమోదు చేయలేదని వివరించారు.

సెంట్రల్ జీఎస్టీ గుంటూరు సర్కిల్ రెవెన్యూ రూ.108 కోట్లు

- గత ఏడాది కంటే మూడు రెట్లు అధికం
- సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ కమిషనర్ ఆనంద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్ జీఎస్టీ ఆడిట్ కమిషనర్ ఆనంద్‌కుమార్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): సెంట్రల్ జీఎస్టీ గుంటూరు ఆడిట్ సర్కిల్ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం జూలై నాటికి రూ.108 కోట్లు రెవెన్యూ సాధించామని కేంద్ర జీఎస్టీ ఆడిట్ కమిషనర్ పి.ఆనంద్‌కుమార్ చెప్పారు. కాకాని రోడ్డులోని జీఎస్టీ ఆడిట్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అమరావతిలో జీఎస్టీ టవర్స్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తామని వివరించారు. గత ఆర్థిక సంవత్సరం జీఎస్టీ ఆడిట్ అభ్యంతరాల ద్వారా రూ.72 కోట్లు వసూలు చేస్తే ఈ ఏడాదిలో దానికంటే మూడు రెట్లు అధికంగా వసూలు చేస్తామని పేర్కొన్నారు. గుంటూరు ఆడిట్ పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరం 902 పరిశ్రమలు ఆడిట్ చేయాల్సి ఉండగా ఇప్పటికే 370 పూర్తి చేశామని వెల్లడించారు. అమరావతిలో జీఎస్టీ టవర్ నిర్మాణానికి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించిందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో జీఎస్టీ ఆడిట్ రాష్ట్ర కార్యాలయం చీఫ్ కమిషనర్, జీఎస్టీ అప్పీల్ కార్యాలయాలన్నీ ఒకే సముదాయంలో నిర్మించనున్నట్లు వెల్లడించారు. పన్నుల ఎగవేతకు పాల్పడే వారిపై నిఘా పెట్టామని హెచ్చరించారు. బిల్లులు లేకుండా ఇన్‌పుట్ ట్యాక్స్ కోరే వారిని గుర్తించేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. తప్పుడు పత్రాలతో వ్యాపార లావాదేవీలు జరిపే వారిని గుర్తించి పన్నులు, జరిమానాలు వసూలు చేస్తామని, మూడు నెలల జైలు శిక్ష విధించే అవకాశం ఉందని వివరించారు. అవసరమైతే రిజిస్ట్రేషన్ రద్దు చేసే అధికారమూ ఉందని పేర్కొన్నారు. ఇక నుంచి పన్ను ఎగవేతదారులను గుర్తించేందుకు అధికారులతో ప్రతినెలా సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమావేశంలో ఆడిట్ డెప్యూటీ కమిషనర్ వి.వెంటేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ ఎస్.వి.సుబ్రహ్మణ్యం, సూపరిటెండెంట్లు కె.రామారావు, సి.వి.సుబ్రహ్మణ్యం, పి.నరేస్‌బాబు, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ చైర్మన్లకు సర్కార్ షాక్

- పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేసే పని అప్పగింత
- వారంలో రెండు రోజులపాటు ఎస్ఎంసీ సభ్యులు ఆ పనిచేయాలి
- మరో రెండు రోజులు సచివాలయ ఉద్యోగులకు బాధ్యతలు
- హెచ్ఎంలకు ఫొటోల బాధ్యత తప్పించి సర్వే విధులు
- ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ ఉన్నతాధికారులు
- మండిపడుతున్న చైర్మన్లు, సచివాలయ ఉద్యోగులు



ప్రత్తిపాడు రామానగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలోని మరుగుదొడ్లు

ప్రత్తిపాడు: కొత్తగా ఎన్నికైన ఎస్ఎంసీ (పాఠశాల యాజమాన్య కమిటీ) చైర్మన్లకు కూటమి ప్రభుత్వం దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యతలను ఎస్ఎంసీ చైర్మన్లకు, సభ్యులకు అంటగట్టింది. వారంలో రెండు రోజులు వారు ఈ పనిచేయాల్సి ఉంటుంది. ఈ మేరకు మిడ్ డే మీల్స్, సమగ్ర శిక్ష డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు ప్రధానోపాధ్యాయులకు మరింత తలనొప్పిగా మారనున్నాయి. ఫొటోల బాధ్యత నుంచి వారిని తప్పించినా సర్వే విధులు పురమాయించారు.

ఇప్పటివరకు ఇలా..

ఇప్పటి వరకూ పాఠశాలల్లో మరుగుదొడ్లు, వాష్ బేసిన్లు, యూరినల్స్ గదుల పరిశుభ్రతకు సంబంధించి ఎప్పటికప్పుడు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఫొటోలు తీసి ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేసేవాళ్లు. హెచ్ఎం అందుబాటులో లేని సమయంలో ఇతర ఉపాధ్యాయులు ఈ పని చేసేవాళ్లు. ఈ పనిపై కొంతకాలంగా ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర అభ్యంతరం తెలుపుతున్నాయి. టీచర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారంటూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టీడీపీ నేతలు రాద్ధాంతం చేసిన విషయం తెలిసిందే.

సచివాలయ ఉద్యోగులకు, ఎస్ఎంసీ చైర్మన్లకు..

తాజాగా విద్యాశాఖ వెలువరించిన ఉత్తర్వుల ప్రకారం మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యత ఎడ్యుకేషన్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లది. వీరు వారంలో రెండు సార్లు అంటే సోమ, గురువారాలు పాఠశాలలను సందర్శించి ఫొటోలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అదేవిధంగా ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులూ వారంలో రెండుసార్లు అంటే బుధవారం, శుక్రవారం పాఠశాలలను సందర్శించి యాప్‌లో మరుగుదొడ్ల ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. ఇందుకు ఐఎంఎంఎస్ యాప్ లాగిన్‌ను ఎస్ఎంసీ సభ్యులు, చైర్మన్లకు అందించాల్సి ఉంటుంది. దీనిపై అటు సచివాలయ ఉద్యోగులు, ఇటు పాఠశాల యాజమాన్య కమిటీల సభ్యులు, చైర్మన్లు నిప్పులు చెరుగుతున్నారు. తమకు ఈ బాధ్యతలేంటని మండిపడుతున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయం హెచ్ఎంలకు తలనొప్పిగా మారనుంది. పాఠశాలలకు వచ్చి ఫొటోలు తియ్యండని ఎస్ఎంసీ చైర్మన్‌లకు చెప్పలేక, చెబితే వారు ఎలా స్పందిస్తారో తెలియక హెచ్ఎంలు తలపట్టుకుంటున్నారు.

ఇదేమి సవతి ప్రేమ..

కూటమి ప్రభుత్వం తమపై సవతి ప్రేమ చూపిందని ప్రధానోపాధ్యాయులు మండిపడుతున్నారు. పైకి మాత్రం ఫొటోలు తీసే బాధ్యత నుంచి తప్పిస్తూ ఉత్తర్వులిచ్చారు కానీ అదే ఉత్తర్వుల్లో మరో మెలిక కూడా పెట్టారు. రోజూ పదమూడు అంశాలతో రూపొందించిన సర్వే ఫార్మాట్‌ను పూర్తి చేసి హెచ్ఎంలు యాప్‌లో అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఒక సమస్య నుంచి తప్పించి, మరో సమస్యను తగిలించడంతో వారు ఆగ్రహంగా ఉన్నారు.

ఇదేమి నిర్ణయం



ఎస్ఎంసీ చైర్మన్లు మరుగుదొడ్ల ఫొటోలు తీయాలంటూ విద్యాశాఖ ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం ఆశ్చర్యం కలిగించింది. గతంలో ఉపాధ్యాయుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా పనులు చేయిస్తున్నారంటూ ఇప్పుడు అధికారంలో ఉన్న పెద్దలు ఆనాడు ప్రతిపక్షంలో ఉండి చెప్పారు. మరి ఇప్పుడు అవే పనులు చైర్మన్లతో ఎలా చేయిస్తారు. పునరాలోచించాలి.

– గొల్లపూడి అంజని, ఎస్ఎంసీ చైర్మన్, జెడ్పీ ఉన్నత పాఠశాల, కోయవారిపాలెం

ప్రత్యామ్నాయంగా వాడుకోవడం తగదు



ప్రభుత్వ ఉద్యోగుల ఎవరు ఏ పనిని కాదన్నా ప్రత్యామ్నాయంగా సచివాలయ ఉద్యోగులను ఎంచుకోవడం అత్యంత బాధాకరం. ఇప్పటికే బీఎల్‌వోల డ్యూటీలు, ఇసుక రీచ్‌ల వద్ద కాపలా పనులు అప్పగించారు. తాజాగా ఇప్పుడు స్కూల్స్‌లో వారానికి రెండు సార్లు మరుగుదొడ్ల ఫొటోలను తీసే బాధ్యతలు. టీచర్లు చేయని పనిని సచివాలయ ఉద్యోగులకు బదలాయించటం బాధాకరం.

–బిజ్జం రోజాప్రకాష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్

క్లుప్తంగా

ఏఎస్పీ(క్రైం) శ్రీనివాసరావుకు డీజీపీ కమాండేషన్ మెడల్



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): జిల్లాలో నేరాల నియంత్రణలో ప్రతిభ చూపిన ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు డీజీపీ కమాండేషన్ డిస్క్ మెడల్, ప్రశంసాపత్రానికి ఎంపికయ్యారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సతీష్‌కుమార్ ఏఎస్పీకి పతకం, ప్రశంసాపత్రాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో సంచలనం సృష్టించిన నేరాల్లో నిందితులను అరెస్ట్ చేసి, సకాలంలో బాధితులకు సొమ్ము అందించడంలో శ్రీనివాసరావు ప్రతిభ కనబరిచారని వివరించారు.

కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులకు నియామకపు ఉత్తర్వులు

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు ఎంపికైన వారికి మంగళవారం గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు(ఆర్డీ) కార్యాలయంలో కౌన్సెలింగ్ జరిగింది. మూడు ఉమ్మడి జిల్లాల్లో 95 పోస్టుల భర్తీ కోసం చేపట్టిన కౌన్సెలింగ్‌కు 84 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 11 మంది గైర్హాజరయ్యారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం అర్హులకు ఆర్డీ డాక్టర్ సుచిత్ర నియామకపు ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్ షేక్ నాగూర్‌షరీఫ్, సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు పాల్గొన్నారు.

- ఎన్టీఆర్ స్టేడియం స్విమ్మింగ్‌పూల్ అస్తవ్యస్తం
- ఫ్లోరింగ్ టైల్స్ పగిలిపోయిన వైనం
- ప్రాంగణంలో పిచ్చిమొక్కలు
- విషపురుగుల సంచారం
- పట్టించుకోని నగరపాలకసంస్థ

కొలనులో ఎదురీత



బయట భాగంలో పగిలి పోయిన టైల్స్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలోని ఈత కొలను(స్విమ్మింగ్ పూల్) సమస్యలతో కునారిల్లుతోంది. ఫ్లోరింగ్ టైల్స్ పగిలిపోయి అస్తవ్యస్తంగా మారింది. ప్రాంగణంలోనూ పిచ్చిమొక్కలు మొలిచాయి. విషపురుగులకు ఆవాసంగా మారింది. పిచ్చిమొక్కలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకుపోవడంతో ఒక్కోసారి షార్ట్‌సర్క్యూట్ వల్ల కరెంట్ సరఫరాకు ఆటంకం కలుగుతోంది. దీంతో ఆ రోజు పూల్‌కు సెలవు ప్రకటించాల్సి వస్తోంది. ఈత సాధకులు దుస్తులు మార్చుకునే గదులు బూజు పట్టి అధ్వానంగా ఉన్నాయి. మరుగుదొడ్లు దుర్గంధం వెదజల్లుతున్నాయి. చిన్నపిల్లల ఈతకొలను సుదీర్ఘకాలంగా నిరుపయోగంగా ఉంది. ఫలితంగా ఇక్కడికొచ్చే ఈత సాధకులు, వీరికి తర్ఫీదునిచ్చే కోచ్‌లు, సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు.

నిర్వహణ ఫీజు వసూలు చేస్తున్నా..

ఈ స్విమ్మింగ్ పూల్‌కు నిత్యం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు పురుషులు ఉదయం 11 గంటల సమయంలో యువతులు, మహిళలు శిక్షణకు వస్తుంటారు. దీనికి ఒక్కొక్కరు రూ.1,500 నగరపాలక సంస్థకు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఏడాది, లైఫ్‌టైమ్ ఫీజులు చెల్లించేవారూ ఉంటారు. రోజూ సుమారు 200 మంది ఇక్కడ తర్ఫీదు పొందుతారు. వీరికి శిక్షణ ఇచ్చేందుకు జాతీయస్థాయిలో నిష్ణాతులైన కోచ్‌లు, సహాయకులు ఉన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో సత్తాచాటి బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. అయినా ఈ పూల్‌ను అధికారులు పట్టించుకోవడం లేదు. నిర్వహణ ఫీజు వసూలు చేస్తున్నా.. సమస్యలు పరిష్కరించడం లేదు.


క్రీడా కోచ్‌లకు అందని జీతాలు!

ఎన్టీఆర్ స్టేడియంలో ఈతతోపాటు పలు క్రీడల్లో కోచ్‌లు, సహాయకులు శిక్షణ ఇస్తుంటారు. వీరికి జీతాలు స్టేడియం కమిటీ ద్వారా ఇస్తున్నారు. అయితే ఇటీవల స్టేడియం కమిటీ కో–ఆర్డినేటర్ మృతి వల్ల ఈనెల జీతాలు ఇంకా వారికి అందలేదు. స్టేడియం కమిటీ ద్వారా కాకుండా తమకు నగరపాలక సంస్థ ద్వారా జీతాలు ఇవ్వాలని కోచ్‌లు, సహాయకులు కోరుతున్నారు.

జనవరిలో మరమ్మతులు

వచ్చే జనవరి నెలలో పూల్ మెయింటెనెన్స్ జరుగుతుంది. అప్పుడు ఫ్లోరింగ్ బాగుచేయిస్తాం. ప్రాంగణంలో పేరుకు పోయిన పిచ్చి మొక్కలను సంబంధిత సిబ్బందితో మాట్లాడి తొలగిస్తాం. పరిశుభ్రంగా ఉంచుతాం.

– సుందర రామిరెడ్డి, గుంటూరు నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్



పూల్ లోపలి భాగంలో పగిలి పోయిన ఫ్లోరింగ్ టైల్స్



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకుపోయిన పిచ్చిమొక్కలు

గుంటూరు చానల్ పొడిగింపునకు నిధులివ్వాలి

కలెక్టర్‌కు ఎమ్మెల్సీ లక్ష్మణరావు వినతిపత్రం



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని శాసన మండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు కోరారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ నాగలక్ష్మిని కలిసిన ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు అధికారపార్టీ హామీ ఇచ్చిందని, దానిని నిలబెట్టుకోవాలని కోరారు. చానల్‌ను పొడిగిస్తే ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, బాపట్ల, పర్చూరు మండలాలకు చెందిన 50 గ్రామాలకు తాగునీరు, 80వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని వివరించారు. స్పందించిన కలెక్టర్ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వివరించారు. ఎమ్మెల్సీ వెంట సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సీపీఎం పెదనందిపాడు కార్యదర్శి డి.రమేష్‌బాబు ఉన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.5,500, గరిష్ట ధర రూ.7,400, మోడల్ ధర రూ.6,500 వరకు పలికింది.

కేఎల్‌యూలో మహిళా బిజినెస్ సమ్మిట్


తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో మంగళవారం మహిళా బిజినెస్ సమ్మిట్‌ను నిర్వహించారు. రాష్ట్ర స్మాల్ మీడియం ఎంటర్ పెన్యూర్ షిప్ (ఎంఎస్ఎంఈ) శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కేఎల్‌యూ కార్యదర్శి కోనేరు శివకాంచన లత ముఖ్య అతిథులుగా విచ్చేశారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలకు అన్ని రంగాలలో ప్రోత్సాహకాలు ఉంటాయని వివరించారు. మహిళా పారిశ్రామికవేత్తల ఉన్నతికి కృషి చేస్తామన్నారు. కోనేరు శివకాంచన లత మాట్లాడుతూ రాబోయే తరానికి మహిళా పారిశ్రామికవేత్తలే దిక్సూచి అని చెప్పారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ డాక్టర్ కె.రాఘవ రావు, దొప్పలపూడి అశోక్ కుమార్, కేంద్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ అశోక్‌రెడ్డి, నారీ శక్తి అవార్డు గ్రహీత రమాదేవి, వీసీ పార్థసారథివర్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సర్కారు అగ్రకుల కూటమి

ప్రముఖ కవి డాక్టర్ కత్తి పద్మారావు



పుస్తకాలను స్వీకరించిన వారితో డాక్టర్ పద్మారావు

పొన్నూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవన విధానాన్ని యువకులు అలవర్చుకోవాలని ప్రముఖ కవి డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని లుంబినీవనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌ను పామర్రుకు చెందిన ప్రముఖులు కోటే రామనాథ్, కాకి కిరణ్ సందర్శించారు. ఈ సందర్భంగా కత్తి పద్మారావు మాట్లాడుతూ గ్రామీణ అంబేడ్కర్ యువజన సంఘాలు దళితుల ఐక్య సంఘటన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ ప్రభుత్వం అగ్రకుల కూటమి అని, సర్కారు అగ్రవర్ణాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. అంబేడ్కర్ విగ్రహాల మీద కూడా దాడులు చేయటం చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత ఉద్యమం మొదటి నుంచి ఆత్మగౌరవంతో నడిచిందని, కారంచేడు, చుండూరు, లక్ష్మీపేట వంటి అన్ని పోరాటాల్లో అగ్రకులాలను ఎదిరించి ఎన్నో హక్కులు సాధించామని వెల్లడించారు. రాబోయేది దళిత బహుజన రాజ్యమేనని, ఈ అగ్రవర్ణాల కూటమి ఎంతో కాలం ఉండదని పేర్కొన్నారు. సంపద పంచుకునే విషయంలో అగ్రకులాల్లో వైరుధ్యాలు వస్తాయని, వేచి చూడాలని చెప్పారు. పద్మారావు రచించిన కొన్ని గ్రంథాలను సందర్శకులు స్వీకరించారు.

చట్టానికి లోబడి వ్యాపారం చేయాలి

ఎరువుల డీలర్లతో వ్యవసాయశాఖ కమిషనరేట్ ఏడీ కృపాదాస్



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్ కృపాదాస్ చిత్రంలో నున్న వెంకటేశ్వర్లు, అధికారులు

కొరిటెపాడు(గుంటూరు): చట్టానికి లోబడి డీలర్లు ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల వ్యాపారం చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ అడిషనల్ డైరెక్టర్(ఏడీ) వీడీవీ కృపాదాస్ చెప్పారు. గుంటూరు అరండల్‌పేటలోని ఫెర్టిలైజర్స్ కల్యాణ మండపంలో ఎరువుల నియంత్రణ చట్టంపై డీలర్లు, వ్యాపారులు, వ్యవసాయశాఖ అధికారులకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో లైసెన్స్‌లు పొందిన డీలర్లు, వ్యాపారులు కొత్త జిల్లాల పరిధిలోనే వ్యాపారం చేయాలని కోరారు. రైతులు ఇబ్బందులు పడకుండా అవసరమైన ఎరువులు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. పక్క రాష్ట్రాల్లో ఎరువుల సమస్య ఉందని, రాష్ట్రంలో లేదని వెల్లడించారు. డీలర్లు, వ్యాపారులు సామాజిక బాధ్యతను మరవరాదని చెప్పారు. అవతకవలకు పాల్పడితే లైసెన్సులు రద్దుచేస్తామని, సంబంధిత అధికారులపైనా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కృత్రిమ కొరత సృష్టించడం, ఎమ్మార్పీ కంటే మించి అమ్మడం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. వ్యవసాయ శాఖ సహకారం ఎప్పుడూ ఉంటుందని వివరించారు. విచక్షణా రహిత ఎరువుల వాడకం అనర్థమని, ఈ విషయాన్ని రైతులకు తెలియజేయాలని సూచించారు.

ఈ–పోస్ ద్వారానే అమ్మకాలు జరగాలి

జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ–పోస్ ద్వారానే ఎరువులు అమ్మకాలు జరగాలని సూచించారు. సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిదని వివరించారు. ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.వి.నాగిరెడ్డి మాట్లాడుతూ ఈనెల చివరిలో ఆల్ ఇండియా ఫెర్టిలైజర్స్ డీలర్స్ అసోసియేషన్ సమావేశం ఢిల్లీలో జరగనుందని, సమావేశంలో సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. అనంతరం వ్యవసాయశాఖ కమిషనరేట్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజన్ ఎరువుల చట్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో ఐపీఎల్ కంపెనీ ప్రతినిధి లోకమూర్తి, గుంటూరు ఏడీఏ సునీల్, జిల్లాలోని ఏడీఏలు, ఏఓలు, డీలర్లు, వ్యాపారులు పాల్గొన్నారు.

పసుపు రైతులకు పరిహారమేదీ!

పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతు నేతల నిరసన

తెనాలి: దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్నిప్రమాదంలో పసుపు పంటను కోల్పోయిన రైతులకు ప్రభుత్వ ఒప్పందం ప్రకారం క్వింటాలుకు రూ.7,000 చొప్పున ఎప్పుడు ఇస్తారని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు ప్రశ్నించారు. పసుపు పంట కాలిపోయి ఇప్పటికి ఏడు నెలలు గడిచినా నష్టపరిహారం అందకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘ నాయకులు మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. విజయవాడలో సాక్షాత్తు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు, రైతులతో చర్చలు జరిపి పసుపు నష్టపోయిన రైతులకు క్వింటాలుకు రూ.7,000 చెల్లిస్తామని హామీ నిచ్చినట్టు గుర్తుచేశారు. అయినా ఇంతవరకు ఆ దిశగా అడుగులు పడలేదని శివశంకరరావు విమర్శించారు. ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. అగ్ని ప్రమాద బాధిత పసుపు రైతుల సంఘం కన్వీనర్ వేములపల్లి వెంకటరామయ్య, పసుపు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్వామిరెడ్డి మాట్లాడుతూ పరిహారం మంజూరుకు ప్రభుత్వం కాలయాపన చేయటం రైతులను ఆవేదనకు గురిచేస్తోందని అన్నారు. బీమా డబ్బులూ వచ్చేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు ములకా శివసాంబిరెడ్డి, నాదెళ్ల చంద్రశేఖర్, నాదెళ్ల సురేంద్ర, గద్దె శ్రీ హరి, చందు సత్యానారాయణ, శివారెడ్డి, సురేంద్ర, వెంకటేశ్వరరావు, పుల్లయ్య, గోవింద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో మహిళ మృతి

మేడికొండూరు: సిరిపురంలోని చైతన్య కాలనీ మొదలులోని ఎస్సీ కాలనీలో విషజ్వరాలు విజృంభించాయి. డెంగీతో బాధపడుతున్న ఓ మహిళ మంగళవారం మృతిచెందింది. కాలనీకి చెందిన మంచు సౌందర్య (28)కు గత శనివారం రాత్రి జ్వరం వచ్చింది. ఆదివారం గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరింది. వైద్యులు డెంగీ అని నిర్ధారించారు. అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలి కుమార్తె కూడా రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. ఎస్సీ కాలనీలో విజృంభిస్తున్న జ్వరాలతో స్థానికులు భయపడుతున్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించాలని కోరుతున్నారు.

16 మంది సబ్జెక్టు టీచర్లకు స్థాన చలనం

ఎస్జీటీ సీనియార్టీ జాబితాలపై అభ్యంతరాలతో నిలిచిన కౌన్సెలింగ్



గుంటూరులోని ఎంఈఓ కార్యాలయానికి వచ్చిన ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు అర్బన్, రూరల్ మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ సబ్జెక్టులను బోధించే 16 మంది ఉపాధ్యాయులకు స్థాన చలనం కలిగింది. ఎంఈఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో పని సర్దుబాటుపై అధికారులు వారిని అవసరమైన పాఠశాలలకు బదిలీ చేశారు. ఇదిలా ఉంటే ఎస్జీటీల సీనియార్టీ జాబితాపై ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు వ్యక్తం కావడంతో కౌన్సెలింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు ఎంఈఓలు జ్యోతి కిరణ్, నాగేంద్రమ్మ, బీవీ రమణయ్య ప్రకటించారు. కౌన్సెలింగ్ కోసం ఎంఈఓ కార్యాలయానికి వచ్చిన ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో ఉంచిన జాబితాలు ఓపెన్ కాకపోవడం, సీనియార్టీ విషయమై తప్పులు దొర్లడంతో తీవ్ర అభ్యంతరం తెలిపారు.

'సంక్లిష్టంగా సర్దుబాటు'

ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియ విద్యాశాఖాధికారుల వైఖరితో సంక్లిష్టంగా మారిందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల కె.బసవ లింగారావు, ఎండీ ఖాలీద్, ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో విమర్శించారు. క్షేత్రస్థాయిలో జరగాల్సిన పని సర్దుబాటును డైరెక్టర్ కార్యాలయం నుంచి నిర్వహించడంపై అభ్యంతరం తెలిపారు. విద్యాశాఖ మంత్రి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలను ఏర్పాటు చేయకపోవడంతోపాటు విద్యాశాఖ డైరెక్టర్ నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు దిగువ స్థాయి అధికారులు అమలు పర్చకపోవడంతో గందరగోళం నెలకొందని పేర్కొన్నారు.

వృద్ధురాలిని బంధించి చైన్ అపహరణ

- రేషన్ బియ్యం కొంటామని వచ్చి దోచుకున్నారు
- బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు
- సీసీ పుటేజ్ ఆధారంగా దర్యాప్తు



సీతామహాలక్ష్మి

పెదకూరపాడు: ఓ వృద్ధురాలిని బెదిరించి, చీర కొంగుతో బంధించి ఆమె మెడలో ఉన్న నాలుగు సవర్ల బంగారం అపహరించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామంలోని బుచ్చియ్యపాలెం రోడ్డులో 70సంవత్సరాలు వయస్సు కలిగిన చుండు సీతామహాలక్ష్మి ఒంటరిగా జీవిస్తోంది. మరో వీధిలో ఆమె పిల్లలు నివాసం ఉంటున్నారు. కొందరు యువకులు రేషన్ బియ్యం కొంటామని ఆ చుట్టు పక్కల ఇళ్లకు వెళ్లి ఆరా తీస్తున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో సీతామహాలక్ష్మి గృహంలో ఒక వ్యక్తి చొరబడ్డాడు. వృద్ధురాలు నోరు మూసి ఒంటిపై ఉన్న నాలుగు సవర్ల బంగారం ఇవ్వాలని బెదిరించాడు. భయభ్రాంతులకు గురైన వృద్ధురాలు సీతామహాలక్ష్మి తన మెడలోని చైన్ తీసి ఇచ్చింది. చెవ్వులకు ఉన్న దుద్దులు తీసుకునే ప్రయత్నం చేయగా అవి నకిలీవి అని చెప్పడంతో వాటి జోలికి వెళ్లలేదు. చీర కొంగుతో పక్కన ఉన్న కుర్చీలో వృద్ధురాలిని బంధించి దుండగుడు పరారయ్యారు. మరో దుండగుడు రోడ్డుపై ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద బైక్‌తో సిద్ధంగా ఉన్నాడు. అనంతరం ఇద్దరూ కలసి బైక్‌పై పరారయ్యారు. కొంత సమయం తరువాత వృద్ధురాలు చీర కొంగు ముడిని విడిపించుకోని బయటకు వచ్చి కేకలు వేసి స్థానికులకు జరిగిన సంఘటన తెలిపింది. స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బాలూనాయక్ సిబ్బందితో వచ్చి స్థానికంగా ఉన్న శ్రీ కాకతీయ పాఠశాలలో ఉన్న సీసీ పుటేజ్‌లను పరిశీలించారు. బైక్‌పై వెళ్తున్నట్లు సీసీ పుటేజ్‌లో కనిపించడంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నా రు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. గత శుక్రవారం ఇదే ప్రాంతంలో శాఖమూరి శ్రీనుకు చెందిన పాడి గేదె అపహరణకు గురైంది. గ్రామస్తులు భయందోళనకు గురవుతున్నారు.